క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు, అగ్రహార ఆంజేనేయస్వామి

హొళగుంద: మండల కేంద్రం శివారులో వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామి ఆలయంలో విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేక, ఆకుపూజ, తదితర పూజలు చేపట్టారు. భక్తులకు అగ్రహార ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు అన్నదాన, తీర్థ ప్రసాద పంపిణీ చేపట్టారు. అలాగే ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిపించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఆలూరు: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లలిత శనివారం తెలిపారు. మండలంలోని మరకట్టు గ్రామంలో మల్లికార్జున నుంచి 288 కర్ణాటక ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని స్కూటర్ సీజ్ చేశామని, అలాగే హత్తిబెళగల్ గ్రామానికి చెందిన సలీం బాషాను అరెస్టు చేసి 672 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. దాడులలో డీటీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఎస్‌ఐలు నవీన్ బాబు, ఇంద్ర కిరణ్ తేజ పాల్గొన్నారు.

పొదుపుగా వాడుకుందాం



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

ఆదోని అర్బన్: విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని భావితరాలకు వెలుగునిద్దామని విద్యుత్‌శాఖ ఆదోని, ఆలూరు ఏడీఈలు పురుషోత్తం, సంతోష్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఈఈ కార్యాలయం ఎదుట వారోత్సవాల పోస్టర్లను విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది విడుదల చేశారు. అనంతరం ఏడీఈలు మాట్లాడుతూ అవసరం మేరకు విద్యుత్‌ను ఉపయోగించాలన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఈఈ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల మీదుగా కోట్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు లోకేష్, నాయక్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోసిగి: దుద్ది గ్రామ రిజర్వాయర్ వద్ద ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం డి.బెళగల్ గ్రామానికి చెందిన బజారి, నరసింహులు హల్వి నుంచి కోసిగి వైపు వస్తున్నారు. కోసిగి నుంచి మరో వాహనం హల్వి వైపు వెళుతూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బజారి, నరసింహులకు తీవ్రగాయాలు కావడంతో కోసిగి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తరలించారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టమాట రైతు దిగాలు

పత్తికొండ(తుగ్గలి): ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో టమాట రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కొద్ది రోజులుగా పత్తికొండ మార్కెట్‌లో టమాట ధరలు అమాంతం పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మార్కెట్‌లో కిలో రూ. 2, రూ.3 నుంచి ప్రారంభమై రూ.15 వరకు పలికింది. నాణ్యత పేరుతో వ్యాపారులు కొంత సరుకుకు మాత్రమే గరిష్ఠ ధర పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చాలా మంది రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ధరల పతనంతో కూలీలు కూడా గిట్టుబాటు కాక టమాట కాయలను పొలంపై వదిలేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. జిల్లా మార్కెటింగ్ సహాయ సంచాలకులు నారాయణమూర్తి, ఉద్యానవనశాఖ అధికారి రామాంజనేయులు మార్కెట్‌ను సందర్శించారు. టమాట కొనుగోళ్లను తనిఖీ చేసి వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. కేజీ టమాట రూ.4 చొప్పున తప్పనిసరిగా కొనుగోలు చేయాలని, నాణ్యమైన టమాటకు సరైన ధర చెల్లించాలని ఆదేశించారు. శనివారం మార్కెట్‌కు 42 టన్నుల టమాట ఉత్పత్తులు రాగా కనిష్ఠంగా క్వింటాల్ ధర రూ.1000, గరిష్ఠంగా క్వింటాల్ రూ. 2వేలు, మధ్య ధర క్వింటాకు రూ.1500 పలికిందని చెప్పారు. సేకరించిన 8టన్నులు విజయవాడ రైతు బజార్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నలీస్ పాల్గొన్నారు.



పత్తికొండ మార్కెట్‌లో టమాట విక్రయాలు

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



ఏబీసీ సాగునీటి సంఘం టీసీ మెంబర్లకు ధ్రువ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి వెంకటేశ్వర గౌడ్

తుగ్గలి : సాగునీటి సంఘాల ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించారు. శనివారం మండలంలోని మూడు చెర్వులు, ఒక కాలవ కింద నీటి వినియోగదారుల సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పగిడిరాయి చెరువు నీటి సంఘం అధ్యక్షుడుగా పాటీల్ విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యాంగటయ్య, చెన్నంపల్లి చెరువు నీటి సంఘం అధ్యక్షుడుగా హోసూరు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఇమాంసాహెబ్, జొన్నగిరి చెరువు నీటి సంఘం అధ్యక్షుడుగా గుంత రంగస్వామి, ఉపాధ్యక్షుడుగా ఆదినారాయణ, బొందిమడుగుల హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలవ సంఘం అధ్యక్షుడుగా నునుసరాల్ల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడుగా మద్దిలేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జొన్నగిరి నీటి సంఘం అధ్యక్ష పదవి కోసం టీడీపీలోని రెండు వర్గాలు పట్టబట్టగా చివరకు అధిష్టానం ఆదేశాలతో టాస్ వేసి అధ్యక్షున్ని ఖరారు చేసుకున్నారు. ఆ తర్వాత ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికలను తహసీల్దార్ రమాదేవి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో జొన్నగిరి, తుగ్గలి ఎస్‌ఐలు జయశేఖర్, కృష్ణమూర్తి, పోలీసు బందోబస్తు చేపట్టారు.

ఏకపక్షంగా ఎన్నికలు..

ఆలూరు రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. అప్రజాస్వామిక విధానలకు నిరసనగా ఈ దఫా డబ్ల్యూయూఏ ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించింది. శనివారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేషన్ దాఖలు చేసిన సభ్యులకు 2 గంటలకే అధికారులు ఎన్నిక పత్రాలు అందించారు. మండల పరిధిలో తుంగభద్ర ఎగువ కాలువకు ఉప కాలువ (ఏబీసీ) కింద ఉన్న 8 టీసీలు (ప్రాదేశిక సభ్యులు), మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న హత్తిబెళగల్ చెరువు కింద ఉన్న 6 టీసీలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర గౌడ్ వెల్లడించారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన కిష్టప్ప,ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున ఎన్నికయ్యారు. హత్తిబెళగల్ ఎంఐ ట్యాంక్ అధ్యక్షుడిగా ఈరన్న, రంగప్పను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణను తహసీల్దార్ గోవింద్ సింగ్ పర్యవేక్షించారు.

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు, ముత్తుకూరు, వెంగళాయిదొడ్డి సాగు నీటి సంఘం ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చిన్నహోతూరు సాగు నీటి సంఘం చైర్మన్‌గా నాగేశ్వర రావు, ముత్తుకూరు సాగు నీటి సంఘం చైర్మన్‌గా గోపాల్‌రెడ్డి, వెంగళాయిదొడ్డి సాగు నీటి సంఘం చైర్మన్‌గా బసవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలను తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పర్యవేక్షించారు. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి, ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

చిప్పగిరి: మూడు స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏ చిప్పగిరి కి చెరుకూరి ధనుంజయ్య, రామదుర్గం బెల్లంకొండ రామచంద్ర, డేగులహాలు మీసాల రామాంజనేయులు ఉన్నారు.

కృష్ణగిరి: మండలంలో శనివారం జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. హంద్రీనీవా కాలువ కింద లక్కసాగరంలో చైర్మన్‌గా వడ్డే సుధాకర్, చుంచుఎర్రగుడిలో గొంగ్లళ్ల పెద్ద మద్దయ్య, మైనర్ ఇరిగేషన్ కింద బోయినాల చెరువు చైర్మన్‌గా బిల్లా వెంకటేష్, కూర్మగిరి చెరువుకు గంట్ల లక్ష్మన్న, కంబాలపాడు చెరువుకు కేఈ రమాదేవి, పెనుమాడ చెరువుకు ఈడిగ కృష్ణమూర్తి, గాజులదిన్నె ప్రాజెక్టు కుడికాలువ కింద పోతుగల్లుకు చైర్మన్‌గా సోమలింగంగౌడ్, మన్నేకుంటకు చిన్న మద్దయ్య, ఎస్‌హెచ్ ఎర్రగుడికి మౌలాలి, తొగర్చేడుకు భాస్కర్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

దేవనకొండ: మండలంలోని మాచాపురం, నేలతలమరి, మాచాపురం గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా, కరివేములలో పోటాపోటీగా జరిగింది. దేవనకొండలో మూడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మాచాపురం సాగునీటి సంఘం చైర్మన్‌గా మారందొడ్డి వెంకన్న, వైస్ చైర్మన్‌గా లక్ష్మన్న, కరివేముల చైర్మన్‌గా రంగన్న, వైస్ చైర్మన్‌గా బడిగింజల చిన్నవీరన్న, నేలతలమరి సాగునీటి సంఘం చైర్మన్‌గా చాకలి మాద్న, వైస్ చైర్మన్‌గా ఈడిగ రంగస్వామి ఎన్నికయ్యారు.

హొళగుంద: హొళగుంద-3లో 12 టీసీ మెంబర్లకుగాను 4వ నంబర్ స్థానానికి ఎవరు పోటీ చేయకపోవడంతో మిగిలిన 11 టీసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఉస్మాన్, ఉపాధ్యక్షుడిగా సిద్దిక్‌సాబ్, హొళగుంద-4లో ఉన్న 12 టీసీ మెంబర్లు ఏకగ్రీవం కాగా అధ్యక్షుడిగా మిక్కిలినేని శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జొండే రామచంద్ర, గజ్జహళ్లి-5లో ఉన్న 12 టీసీ మెంబర్లు ఏకగ్రీవం కాగా.. అధ్యక్షుడిగా పెద్ద ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా వందవాగిలి పంపారెడ్డిని ఎన్నుకున్నారు. హెబ్బటం పెద్దవంక సాగునీటి సంఘం అధ్యక్షుడి, ఉపాధ్యక్షులుగా హరిజన ముసలయ్య, గోనెపాడు లక్ష్మప్ప చెల్లవంక సాగునీటి సంఘం అధ్యక్షు, ఉపాధ్యక్షులుగా తాలూరు సరస్వతి, సమ్మతగేరి పక్కీరప్పను ఎన్నుకున్నారు. ఆలూరు సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని ఆరు మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి శనివారం జరిగిన సాగు నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వెల్దుర్తి వీరన్న గట్టు చెరువు చైర్మన్‌గా చిన్న గోపాల్ గౌడ్, కాన్దాన్ చెరువకు ఏసీఎం కిట్టు, నరసాపురం చెరువుకు వెంకటేశ్వర్లుగౌడ్, లక్ష్మినగరం చెరువుకు మురళీధర్‌రెడ్డి, సూదేపల్లి చెరువుకు వడ్డే మద్దయ్య, గోవర్ధనగిరి చెరువుకు రామకృష్ణారెడ్డిని చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



చింతకుంటలో అభ్యర్థులు, ఓటర్లతో మాట్లాడుతున్న ఆలూరు సీఐ వెంకటచలపతి, హాలహర్వి ఎస్‌ఐ చంద్ర

హాలహర్వి: మండలంలో ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో జె.హొసళ్లి (ఎల్లెల్సీ) అధ్యక్షుడిగా పూజారి మల్లప్ప, ఉపాధ్యక్షుడిగా మరిగాదయ్య, బల్లూరు (ఎల్లెల్సీ) అధ్యక్షుడిగా వణేకప్ప, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, బిలేహాల్‌లో (ఎంఐట్యాంక్) అధ్యక్షుడిగా చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా వేమన్నరెడ్డి, కామినహాల్‌లో (ఎంఐట్యాంక్) అధ్యక్షుడిగా సి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా నారాయణప్ప, అర్ధగేరి (ఆలూరు బ్రాంచి కెనాల్ హెచ్‌ఎల్‌సీ) అధ్యక్షుడిగా హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామయ్య, చింతకుంట(హెచ్‌ఎల్‌సీ) అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మాబుసాబ్, చింతకుంట (హెచ్‌ఎల్‌సీ) అధ్యక్షుడిగా కృష్ణప్ప, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతకుంటలో హెచ్‌ఎల్‌సీ కెనాల్ ఎన్నికలు సాయంత్రం వరకు ఉద్రిక్తత నడుమ సాగాయి. దీంతో ఆలూరు సీఐ వెంకటచలపతి చింతకుంటకు చేరుకుని అక్కడి ఓటర్లు, ప్రజలను శాంతింపజేశారు. కొందరు టీడీపీ నాయకులు మళ్లీ ఎన్నికలు జరపాలని పట్టుబట్టగా.. అధికారులు స్పందించి ఆర్డీఓకు అర్జీ పెట్టుకోవాలని పంపించేశారు.

ఎన్నికల నిబంధల ఉల్లంఘన

- తూతూమంత్రంగా ఎన్నికల నిర్వహణ
- మధ్యాహ్నానికే మూతపడిన పోలింగ్ కేంద్రాలు
- నిబంధనలను పట్టించుకోని అధికారులు

కృష్ణగిరి: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికారులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారు. ఈ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ దూరంగా ఉండటంతో అన్ని చోట్ల అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఎన్నికలు నింబంధనల ప్రకారం జరపాల్సిన కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఉన్న ప్రత్యేకతకు వీరు తూట్లు పొడిచారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలకు జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ మండలంలో రెండు చోట్ల మధ్యాహ్నానికే ముగించి మమ అనిపించారు. ఎస్‌హెచ్ ఎర్రగుడిలోని ఎంపీయూపీ పాఠశాలలో జీడీపీ కాలువకు జరిగిన ఎన్నికల్లో సంబంధిత ఎన్నికల అధికారిగా అంగోలి శంకర్ వ్యవహరించారు. అయితే ఈ కేంద్రంలో మధ్యాహ్నం ఒంట గంటకే ఎన్నిక ముగించి తమ సిబ్బందితో పాఠశాలను మూసేశారు. అలాగే తొగర్చేడు సచివాలయంలో జరిగిన జీడీపీ కాలువకు సంబంధించిన ఎన్నికను ఎం.రాజు నిర్వహించారు. ఈయన కూడా మూడు గంటలకే ముగించి సిబ్బందితో కలిసి వెళ్లిపోయారు. నిబంధనల ప్రకారం జరగాల్సిన ఎన్నికలను అధికారులు విస్మరించడంపై ఆయా గ్రామాల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎన్నిక ఏకగ్రీవమైనా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటలోపు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి వారికి డిక్లరేషన్ ఫారాలు ఇవ్వాల్సి ఉండగా ఈ రెండు చోట్ల అధికారులు మాత్రం నిబంధనలు తుంగలో తొక్కి మధ్యాహ్నానికే ముగించారు.



ఎస్‌హెచ్ ఎర్రగుడిలో మధ్యాహ్నం ఒంటి గంటకే మూతపడిన పోలింగ్ కేంద్రం

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



కేసులు పరిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ న్యాయమూర్తి జ్యోతి

ఆలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి జ్యోతి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షణికావేశంతో చేసిన తప్పులకు ఏళ్ల తరబడి న్యాయ స్థానం చుట్టూ తిరగవద్దని ముద్దాయిలకు సూచించారు. నేరాలకు పాల్పడి చేసిన తప్పులను ఒప్పుకున్నవారి కోసం సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాలతో క్షమాపణ కింద కేసులు కొట్టివేస్తున్నామన్నారు. ఇక నుంచి తప్పు చేసి కోర్టుల చుట్టూ తిరగవద్దని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాల అదుపులోకి వస్తాయన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా 249 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీ కృష్ణ కిషోర్, న్యాయవాదులు వాయుజీవోత్తమ రావు,షేక్షావలి,విజయ్ రాజ్, లక్ష్మీకాంత్, విజయ్ భాస్కర్, రాజేష్ నాయుడు, తిమ్మయ్య, యుగంధర్, ప్రసాద్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

సత్వర న్యాయానికి లోక్ అదాలత్

పత్తికొండ(తుగ్గలి) : వ్యాజ్యాన్ని కొనసాగించడం కంటే న్యాయ పరిధిలో రాజీ చేసుకోవడం ఉత్తమమైన మార్గమని, సత్వర న్యాయానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. కేసుల వల్ల సమయం, డబ్బు వృథాతో పాటు మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుందన్నారు. ఇరుపక్షాల అంగీకారంతో కేసులను సత్వరం పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. అనంతరం కేసుల పరిష్కారం వచ్చిన కక్షిదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కక్షదారుల అంగీకారంతో 35 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు క్లర్కు రాఘవేంద్ర తెలిపారు. ఇందులో 29 క్రిమినల్ కేసులు, 4 సివిల్ కేసులు, భరణం, గృహ హింస కేసు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 385 పెట్టీ కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేష్ కుమార్, మైరాముడు, సత్యనారాయణ, మల్లికార్జున, నాగభూషణరెడ్డి, నరసింహయ్య, దామోదరాచారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



కొండపై పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

తుగ్గలి : మండలంలోని లింగనేదొడ్డి కొండపై వెలసిన మునిరంగస్వామి క్షేత్రంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు శనివారం మునిరంగస్వామి, కాశీవిశ్వనాథస్వామి, పార్వతీదేవి, తిమ్మగురుడు స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కొండకు చేరుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎడ్ల గిరక పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో వరుసగా గుడేకల్ చాకలి నల్లయ్య వృషభాలు, ఆకుల మంగయ్య, హొళగుంద వీరన్న, గుడేకల్ రామాంజి వృషభాలు నిలిచాయి. విజేత యజమానులకు వరుసగా బహుమతి దాతలు మధు, సుంకన్న, గ్రామ పెద్దలు, ప్రజలు, వెంకటేష్, చిన్న నరసింహులు, కృష్ణయ్య, హనుమంతు రూ.20వేలు, 15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు. నిర్వాహకులు వెంకటరాముడు, దేవేంద్ర, రాముడు, మాబు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణమంటే.. కళ్లు తేలేయాల్సిందే!



రాళ్లు రప్పలు తేలి అధ్వానంగా కడ్లమాగి రోడ్డు

హొళగుంద: మండల పరిధిలోని కడ్లమాగి రోడ్డు పూర్తి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారులు కళ్లు తేలేస్తున్నారు. అడుగడుగునా రాళ్లు, కంకర తేలి, గుంతలు పడి ఉండటంతో రాకపోకలు సాగించడం గగనంగా మారింది. రోడ్డును బాగు చేయాలని చాలా కాలం నుంచి ఆయా గ్రామాల ప్రజలు, రైతులు మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మోకాలోతు గుంతలున్న ఈ రోడ్డులో వర్షా కాలంలో ప్రయాణం నరకాన్ని చూపుతోంది. ఈ మార్గంలో రైతుల పొలాలకు, కడ్లమాగి గ్రామంతో పాటు గజ్జహళ్లి గ్రామానికి రాకపోకలు సాగిస్తారు. గజ్జహళ్లికి చేరుకోవడానికి ఈ మార్గంలో వెళ్తే 8 కి.మీ. ఉంటుంది. చుట్టూ తిరిగి వెళ్తే దాదాపు 20 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ఈయన పేరు తిరుపాల్ యాదవ్. అమినాబాద్‌లో గొర్రెల కాపరి. కొద్ది రోజుల క్రితం ఆయన గొర్రెల మందలోని కొన్ని జీవాలకు పారుడు వ్యాధి సోకడంతో పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స చేసిన వైద్యుడు ఇక్కడ మందులు లేవు..బయట దుకాణంలో తెచ్చుకోవాలని చీటి రాసిచ్చాడు. గొర్రెలన్నింటికీ మందులు కొనుగోలుకు భారీగానే ఖర్చయ్యింది. ఇంతకు ముందు చికిత్స చేయించినప్పుడు వైద్యులే మందులిచ్చేవారని, ప్రస్తుతం మందులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

చికిత్స మాత్రమే చేయబడును!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని రంగాలు నిరాదరణకు గురయ్యాయి. చివరకు పశువులకు అవసమైన మందులను కూడా సరఫరా చేయకపోవడంతో వైద్యులు చికిత్స మాత్రమే చేసి మందులు బయట తెచ్చుకోవాలని చీటి రాసిస్తున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో నిర్వాహకులు ధర పెంచి విక్రయిస్తుండటంతో పశుపోషకులు, అన్నదాతలకు మందుల కొనుగోళ్లు భారంగా మారాయి. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందజేసిన మందులతోనే నెట్టుకొచ్చారు. ప్రస్తుతం ఆయా పశువైద్యశాలలు మందులు లేక వెలవెలబోతున్నాయి.

- పశు వైద్యశాలల్లో మందుల కొరత
- నిలిచిన మందుల సరఫరా
- మందుల కోసం ప్రైవేటుకు షాపులకు పరుగులు
- జీవాలకు మందులు కొనలేకపోతున్న పెంపకందారులు
- చికిత్సకే పరిమితమైన ఆస్పత్రులు



ఆవుల మంద



జొన్నగిరిలోని పశువైద్య కేంద్రం

తుగ్గలి : పశువైద్యం గాలిలో దీపంలా తయారైంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు గడిచినా పశువైద్యం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో పశువుల వ్యాధులు నయం చేసేందుకు, శస్త్ర చికిత్స జరిగిన జీవాలను కాపాడుకునేందుకు పశు పోషకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలున్నా.. మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అవసరమైన మందులు అందుబాటులో లేక వైద్యులు బయటకు రాసి ఇస్తుండటంతో అంత మొత్తం చెల్లించలేకపోతున్నామని పశుపోషకులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి మందుల సరఫరా నిలిచిపోయింది. చలి కాలం కావడంతో జీవాలకు దొమ్మరోగం, పారుడు రోగం, నట్టల వ్యాధి ప్రబలుతున్నాయి. ఈ సీజన్‌లో దొమ్మరోగం, బొబ్బ రోగం అధికంగా సోకుతాయి.

గత ప్రభుత్వంలో వచ్చిన మందులతోనే సరి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశువైద్యశాలలకు కొరత లేకుండా మందులు అందాయి. ప్రతి మూడు నెలలకోసారి మందులు సరఫరా చేసేవారు. 2024 జనవరిలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సరఫరా చేసిన మందులనే ఇంతకాలం సర్దుబాటు చేశారు. ఇప్పటికే చాలా ఆస్పత్రుల్లో మందులు పూర్తిగా అయిపోయాయి. కూటమి ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడంతో పశు వైద్యశాలల్లో మందులు లేక వెలవెలబోతున్నాయి.

ప్రైవేటును ఆశ్రయించాల్సిందే..

వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకొచ్చిన పశువులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి చికిత్స చేయడం మినహా వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఇచ్చే పరిస్థితి లేదు. ఆస్పత్రుల్లో మందుల కొరతతో బయటి మెడికల్ షాప్‌ల్లో తీసుకోవాలంటూ చీటీలు రాసిస్తున్నారు. మందులు లేవన్న సాకుతో ప్రైవేట్ మెడికల్ షాపుల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తున్నా తప్పని పరిస్థితుల్లో తీసుకుంటూ రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మందులు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆదోని డివిజన్‌లో 2018 పశుగణన లెక్కల ప్రకారం ..

ఆవులు, ఎద్దులు	- 1.22 లక్షలు
గేదెలు	- 80 వేలు.
గొర్రెలు, మేకలు	- రూ.6.63 లక్షలు
పశువైద్యశాలలు	- 37
సబ్ సెంటర్లు	- 42

త్వరలో మందులు సరఫరా

అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టాం. త్వరలో మందులు సరఫరా అవుతాయి. ప్రస్తుతానికి మందుల కొరత అంతగా లేదు. కొన్ని తక్కువగా ఉన్నాయి. కొన్ని రకాల మందులు లేకపోవడంతో బయట తెచ్చుకోవాలని చెబుతున్నాం. అవి కూడా కొన్ని మాత్రమే. ప్రభుత్వం నుంచి త్వరలోనే వచ్చు అవకాశముంది. – వెంకటరమణ, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఆదోని డివిజన్

వైభవంగా పాతూరు ఆంజనేయస్వామి జాతర

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో శనివారం పాతూరు ఆంజనేయస్వామి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. మహోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రతాపం వెంకటేశ్వర్లుశెట్టి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త తెలిపారు.



ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న అశేష భక్తజనం

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో అయ్యప్పస్వామి గ్రామోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం రాత్రి స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామియే శరణం అయ్యప్పా శరణుఘోషలతో గ్రామం మార్మోగింది. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.